# టెక్సాస్‌లో ఘనంగా 'నెల నెలా తెలుగు వెన్నెల' సాహితీ కార్యక్రమం !



టెక్సాస్, జనవరి 20 : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ నిర్వహణలోని తెలుగు సాహితి నిర్వహించిన 'నెల నెలా తెలుగు వెన్నెల' కార్యక్రమం స్థానిక స్పైస్ ఇన్ రెస్టారెంట్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 45 మంది సాహితీ ప్రియులు పాల్గొన్నారు. శ్రీమతి కల్పన రెంటాల ముఖ్య అతిధిగా విచ్చేశారు. తోటకూర ప్రసాద్ తొలిగా వెండ్లూరి సుధాకర్ కవితలను చదివి వినిపించారు.

అనంతరం శ్రీమతి కల్పన రెంటాలను, ప్రసాద్ సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి కల్పన రెంటాల "ప్రవాసాంధ్ర స్త్రీ సాహిత్యం"అనే అంశంపై ప్రసంగించారు. ప్రవాసాంధ్ర స్త్రీలు వారి సావాజిక సమస్యలపై రచనలు చేయడవలసిన అవవ్యకతను నొక్కి చెప్పారు. వేదుల గౌరి, వారి తండ్రి రాసిన రామకృష్ణ శతక పద్యాలను చదివి వినిపించారు.

ఆ తదుపరి కె.సి. చేకూరి తెలుగు మాండలికాలు గురించి మాట్లాడారు. గన్నవరం నరసింహ మూర్తి రాసిన కొన్ని పద్యాలనూ చదివి వినిపించారు. వాఖ్యాతగా వ్యవహరించిన అనంత్ మల్లవరపు, బుకర్ బహుమతి పొందిన అరవింద్ అడిగ నవల "ది వైట్ టైగర్" సారాంశాన్ని ప్రేక్షకులకు క్లుప్తంగా, సరళంగా సార సంగ్రహాన్ని ఆహూతులకు వివరించారు.

చివరగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి కల్పన రెంటాలను, శ్యామల రుమాల్ల, శాంత పులిగండ్ల శాలువతో సత్కరించారు. ఇంకా ప్రెసిడెంట్ ఎలెక్ట్ చంద్ర కన్న గంటి పుష్ప గుచ్చంతో, టాంటెక్స్ ప్రెసిడెంట్ శ్రీధర్ కొర్సపాటి కలిసి జ్ఞాపికతో సత్కరించారు. ఎం.వి.ఎల్ ప్రసాద్ వందన సమర్పణతో ఈ సాహితీ కార్యక్రమం ముగిసింది.